
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కరీంనగర్ టౌన్, జూలై 22: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వర్షాలు, ఇతరత్రా ఏదైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 0878-2997247కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ టోల్ ఫ్రీ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రజావాణి దరఖాస్తులకు
ప్రాధాన్యమివ్వాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, జూలై 22: ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దన్నారు.ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 223 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

● అధికారులు అప్రమత్తంగా ఉండాలి....

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అధికారులంతా మండల కేంద్రాల్లో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూముకు వెంటనే సమాచారం అదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు దృష్టికి సమాచారం తీసుకురావాలన్నారు. వన మహోత్సవాన్ని అధికారులు పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులకు సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, డీఈవో జనార్దన్‌రావు, ఏవో సుధాకర్, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, జూలై 22: టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులను సంబంధిత సెక్షన్లకు పంపించి పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఈ విజయేందర్‌రెడ్డి, ఏడీఈ స్వప్న, ఏఈ సురేష్‌కుమార్, ఎస్‌వో రాజేశం పాల్గొన్నారు.

పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలి

భగత్‌నగర్, జూలై 22: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించకపోవడం బాధాకరమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ స్వామి అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. ఆర్థిక బకాయిలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మహాదేవుని నారాయణస్వామి, వెలిచాల వెంకటస్వామి, హాజి పాషా, మాధవస్వామి పాల్గొన్నారు.



గత ఏడాది జూలై 27న గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీరు(ఫైల్)



ఎల్‌ఎండీలో నీటి నిల్వలు లేక పోవడంతో పూర్తిగా ఎండి పోయిన గేట్లు ముందు భాగం

నాడు జలకళ..నేడు వెలవెల


- గత సంవత్సరం ఈ సమయానికి నిండుకుండలా ఎల్‌ఎండీ
- వర్షాలు ఆలస్యం కావడంతో జలాశయంలో చేరని నీరు



నీరు లేక వెలవెల బోతున్న దిగువ మానేరు జలాశయం

తిమ్మాపూర్, జూలై 22: జిల్లాకు వరప్రదాయని దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ) గత సంవత్సరం ఈ సమయానికి జలకళని సంతరించు కుంది. ఈ యేడు నీరు లేక వెలవెలబోతోంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 920 అడుగులు(24.034 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 887.8 అడుగుల (5.231 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. మోయ తుమ్మెద వాగు నుంచి 945 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వర్ష పాతం తక్కువ నమోదు అయితేతాగు, సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతాయి. 2020లో ఆగస్టు 22 నాడు ఎల్ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి గత ఏడాది వరకు జూలైలోనే ఎల్ఎండీలోకి భారీగా నీరు చేరింది. వరదలతోపాటు మోయతుమ్మెద వాగు నుంచి, ఎస్సారెస్పీ, ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి నీరు వస్తే ఎల్ఎండీ నిండుతుంది. మూడు రోజులపాటు కురిసిన వర్షాలతో ఎల్ఎండీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో ప్రారంభమైంది.

సంవత్సరం	గేట్ల నుంచి నీటి విడుదల చేసిన తేది	రిజర్వాయర్ లెవల్	డ్యాంలో ఉన్న నీటి నిల్వలు (టీఎంసీలు)	దిగువకు విడుదలైన నీరు (టీఎంసీలు)
2020-21	22 ఆగస్టు 2020	918.85 ఫీట్లు	22.455	80.93
2021-22	22 జూలై 2021	916.60 ఫీట్లు	21.182	76.41
2022-23	23 జూలై 2022	916.15 ఫీట్లు	20.821	43.63
2023-24	27 జూలై 2023	917.80 ఫీట్లు	22.165	28.64



ఎల్ఎండీలో ప్రస్తుతం నీటి నిల్వలు

ఆశా వర్కర్లకు ఇచ్చిన
హామీలను నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుభాష్‌నగర్, జూలై 22: కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హమీలను, కమిషనర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారితోషికాలను 18వేలకు పెంచాలని, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఆశాలకు నష్టం కల్గించే పరీక్ష పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీజీ సర్వే, వ్యాక్సినేషన్‌కు తగిన పారితోషికం నిర్ణయించాలని, గతంలో ఇచ్చినట్లు ఆశాలకు ప్రతి నెల 2న పారితోషికాలు చెల్లించాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ 2001 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో లెప్రసీ సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు య శ్రీనివాస్, గుడికందుల సత్యం, కోశాధికారి జి రాజేశం, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, సీఐటీయూ నాయకులు పుల్లెల మల్లయ్య, చలికాని శ్రీనివాస్, ఆశా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

గంగాధర, జూలై 22: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా అటకెక్కించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీసీ సమస్యల పోరుబాటలో భాగంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీసీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ సర్కారు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రతిపాదికన రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేసి బీసీ కమీషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికలకు ముందు చెప్పారన్నారు. ప్రభుత్వం వెంటనే బీసీ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్, నాయకులు వెంకటేశం, వాసుదేవరెడ్డి, వినయ్‌సాగర్, శశీధర్, ప్రశాంత్, నర్సింహారెడ్డి, మల్లేశం, శ్రీహరి, రాజిరెడ్డి, సతీష్, అంజి, మహేష్ పాల్గొన్నారు.

నేరం.. శిక్ష

- పకడ్బందీ సాక్ష్యాలతో నిందితుల ఆటకట్టు
- మూడేళ్లలో 2,431 మందికి శిక్షలు

కరీంనగర్ క్రైం, జూలై 22 : నేరమేదైనా శిక్ష తప్పదు... నేరం చేసినవారు పోలీసులు, కోర్టుల నుంచి తప్పించుకోలేరనే విధంగా కమిషనరేట్ పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ముందుకుసాగుతున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా శిక్షపడుతున్న నిందితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. గడిచిన మూడు సంవత్సరాల వ్యవధిలో 6,421 కేసులు కోర్టు ద్వారా పరిష్కారమయ్యాయి. ఇందులో 2,431 మందికి శిక్షలు పడ్డాయి. ఇందులో 17 మందికి జీవితఖైదు, మరో 21 మందికి మూడేళ్లు, 48 మందికి రెండేళ్ల వరకు జైలుశిక్షలు పడ్డాయి.

● నెలకోసారి సమీక్ష

పెండింగ్‌లోఉన్న కేసులను పోలీసు ఠాణాలు, సర్కిల్, డివిజన్ స్థాయిల్లో ప్రతినెలా సమీక్ష నిర్వహించిన తర్వాత కమిషనరేట్ వ్యాప్తంగా నెలలో ఒక రోజు కేసుల దర్యాప్తు నాణ్యత పరిశీలనపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో కేసుల దర్యాప్తులో ఏవైనా ప్రమాణాలు తగ్గితే వాటిపై నివేదిక తయారు చేసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పోలీసులు చే స్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. చిన్న చిన్న నేరాలను లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ కుదిర్చి పరిష్కరిస్తున్నారు. పీడీయాక్టు అమలుతో కరుడు గట్టిన నేరస్తులు సంవత్సరం పాటు జైల్లోనే ఉండాల్సి రావడంతో వారికి సంబంధించిన ఇతర కేసుల్లో సాక్షులు ధైర్యంగా ముందుకు వచ్చి సాక్ష్యం చెబుతున్నారు. ప్రతి కేసులో సమర్థవంతంగా పనిచేసిన అన్ని స్థాయిలకు చెందిన అధికారులకు నగదు రివార్డులను అందజేస్తుండటంతో అధికారులు, సిబ్బంది నూతనోత్సాహంతో పనిచేస్తున్నారు.



● సరైన సమయంలో సమన్లు

ట్రయల్స్‌కేసుల్లో సాక్షులకు సరైన సమయంలో సమన్లను అందజేసి కోర్టులో ప్రవేశపెడుతున్నారు. నేరాలు జరిగిన తీరుపై మళ్లీ సాక్షులకు అవగాహన కలిపిస్తున్నారు. న్యాయస్థానం ఆవరణపై అవగాహన కలిపించడంతో ప్రాసిక్యూషన్‌కు అనుకూలత ఏర్పడుతోంది.

● 2023 సంవత్సరంలో మొత్తం 1991 కేసులు కోర్టు ద్వారా పరిష్కరమయ్యాయి. ఇందులో 765 కేసుల్లో కోర్టు శిక్ష విధించింది. 618 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కర మయ్యాయి. 47 మంది నిందితులకు కారాగార శిక్ష విధించారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

గణేశ్‌నగర్, జూలై 22: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వివిధ విద్యార్థుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 30 శాతం కేటాయించాలని కోరారు. సంక్షేమ హాస్టల్లో అర్హులైన విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచాల నవీన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్, ఉపాధ్యక్షుడు మారుతి ఏఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్, జిల్లా నాయకులు మహేష్, జిల్లా కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్, మండల అధ్యక్షుడు హరీష్ పాల్గొన్నారు.

తల్లిని దూషించవద్దన్నందుకు..

● తమ్ముడిని హత మార్చిన అన్న ● తండ్రిపైనా దాడి ● గోదావరిఖనిలో దారుణం

కోల్‌సిటీ, జూలై 22: మద్యం సేవించి వచ్చి తల్లిని అసభ్యపదజాలంతో దూషిస్తున్న అన్నను వారించినందుకు తమ్ముడిని హత మార్చిన ఘటన సోమవారం రాత్రి గోదావరిఖని కృష్ణ నగర్‌లో చోటు చేసుకున్నది. కృష్ణనగర్‌లో నివాస ముండే ఆత్మకూరి సునీల్(27)ను అతని నివా సంలోనే అతని అన్న ఆత్మకూరి అనిల్ కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డు వచ్చిన అతని తండ్రి ఓదెలును కూడా పొడిచాడు. ఘటనకు సంబం ధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంతర్గాం మండలం పెద్దం పేటకు చెందిన ఆత్మకూరి ఓదెలు కుటుంబం కొన్నేళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చి స్థిరపడింది. అతడు టెంట్‌హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి అనిల్, సునీల్(27) కుమారులు ఉన్నారు. సునీల్ శ్రీకళ ను ప్రేమ వివాహం చేసుకోగా విజయరాం(3), వియ(2) పిల్లలు ఉన్నారు. అనిల్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుండగా సునీల్ బస్టాండ్ వద్ద హోటల్ నడుపుతున్నాడు. అనిల్ గతంలో హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న సమయంలో ఒక వివాహితను ప్రేమించానని, ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ తల్లి రాజమ్మపై ఒత్తిడి తీసుకు వచ్చేవాడు.



సునీల్ (ఫైల్)



చికిత్స పొందుతున్న తండ్రి ఓదెలు

మద్యానికి బానిసైన అనిల్ తండ్రి టెంట్‌హౌస్‌లోని సామగ్రిని కూడా అమ్ముకుని మద్యం సేవించేవాడు. చిల్లర దొంగతనాలకు సైతం పాల్పడేవా డు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అనిల్ తల్లి రాజమ్మతో గొడవ పడి అసభ్యపద జాలంతో దూషిం చాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన తమ్ముడు సునీల్ అడ్డు చెప్పడంతో కత్తితో దాడికి పాల్ప డ్డాడు. విచక్షణ రహితంగా పొడవ డంతో సునీల్ కుప్పకూలాడు. అడ్డు వెళ్లిన తండ్రి ఓదెలును కత్తితో పొడిచాడు. అతడు కూడా గాయపడ్డాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను గోదావరిఖని ప్రభుత్వాసు పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

రాయికల్, జూలై 22: మండలంలోని మూటపెల్లి గ్రామానికి చెందిన మ్యాకల భూమరాజు(45) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భూమరాజుకు భర్త రాజంతో 20 సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. కొడుకు కూడా తండ్రితో పాటు ఉండగా భూమరాజు ఒంటరిగా జీవిస్తోంది. కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రాయికల్, జూలై 22: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన నందగిరి గంగారాం పెద్ద కుమార్తె శివానీ (18) డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు శివానిని మొదట జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 21న హైదరాబాద్ నుంచి జగిత్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివానీ కుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు.

ఒకరి అరెస్టు

చందుర్తి జూలై 22: గంజాయి కేసు అరెస్ట్ నుంచి తమ్ముడిని తప్పించడానికి తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి ప్రోత్సహించిన కేసులో అన్నను అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్‌పై వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 31 జనవరి 2024న గంజాయి సరఫరా చేసిన సంఘటనలో కేసు నమోదైంది. ఈ నెల 17న చందుర్తి పోలీసులు అఖిల్‌ను అదుపులోకి తీసుకొని, వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. అఖిల్‌ను వేములవాడకు తరలిస్తుండగా తమ్ముడినిని అరెస్టు నుంచి తప్పించడానికి అన్న రాకేష్ అగ్గిపెట్టెలో బ్లేడు తీసుకువచ్చి తమ్ముడైన అఖిల్‌కు ఇచ్చాడు. అఖిల్ బ్లేడుతో చెయ్యి, కాలు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన రాకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టును తొలగించిన పోలీసులు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వీర్నపల్లి, జూలై 22: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఎల్లారెడ్డిపేట - వీర్నపల్లి ప్రధాన రహదారిపై కంచర్ల శివారులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎల్లాగౌడ్ సిబ్బందితో కలిసి రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించారు. వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చేశారు.

మారుమూల గ్రామాలకు అదనపు బస్సులు నడపాలి



గర్జనపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వీర్నపల్లి, జూలై 22: మారుమూల అటవీ గ్రామాలకు అదనంగా బస్సులు నడపాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్జనపల్లిలో ప్రధాన రహదారిపై విద్యార్థులు, గ్రామస్థులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సిరిసిల్ల నుంచి వన్‌పల్లి వరకు ఉదయం, సాయంత్రం ఒకసారి బస్సును నడపడంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. నాయకులు దేవేందర్, రాజన్న, అభిషేక్, రవి, సునీల్, బాబు పాల్గొన్నారు.

ఎనిమిది ఆటోలు సీజ్

కరీంనగర్ క్రైం, జూలై 22: కరీంనగర్‌లో మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లు లేని ఎనిమిది ఆటోలను సీజ్ చేశారు. ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈ వాహన తనిఖీలు నిర్వహించగా టౌన్ ఏసీపీ జి.నరేందర్ పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం అన్ని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

● సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల రిలే దీక్షలు




దీక్షలను ప్రారంభిస్తున్న పవర్‌లూం వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ , సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, వస్త్ర సంక్షోభాన్ని నివారించాలని వస్త్రోత్పత్తిదారులు, కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. సోమవారం సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణ, విద్యుత్ సమస్య పరిష్కారం, నేతన్నలకు ఉపాధి కల్పన, పెండింగ్ బకాయిల విడుదలకు జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. నేతన్న పోరుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని సీఐటీయూ ప్రకటించగా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో యాత్ర వాయిదా వేశామన్నారు. 20 రోజులైనా ప్రభుత్వం నుంచి చలనం లేదన్నారు. రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదారాబాద్ చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ విధించి పరిశ్రమ సంక్షోభానికి కారణమైందన్నారు. ఓవైపు సమస్యను సృష్టిస్తూ సానుభూతి ప్రద ర్శించడం సరైన పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నేతన్నల మీద ప్రేమ ఉంటే ప్రధానితో మాట్లాడి కేంద్రం నుంచి వస్త్రాల ఆర్డర్లను ఇప్పించాలని అన్నారు. అనంతరం దీక్షలకు బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు నరేష్, సదానందం, రాజు, శ్రీకాంత్, ప్రకాష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాణీరుద్రమ మాట్లాడుతూ బతుకమ్మ చీరల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలన్నారు. నేతన్నలకు విద్యుత్ సబ్సిడీతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సిరిసిల్ల ఉత్పత్తులు ఒకప్పుడు బ్రాండ్‌లాగా ఉండేవని, సొంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల పేరిట ఆదుకుంటామని చెప్పి నాసిరకం చీరలను ఉత్పత్తి చేయించార న్నారు. కార్మికులకు రూ.15 వేల కూలి దొరికేదని, బతుకమ్మ చీరలతో కొంతమంది ఆసాములు లాభపడ్డారని అన్నారు. ప్రభుత్వం బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, ఆర్డర్లను అందించాలని కోరారు. మొదటి రోజు రిలే దీక్షల్లో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, కాటన్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనా రాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీ యూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వేణు, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, యారన్ అసోసి యేషన్ అధ్యక్షుడు పిస్క మధు, డైయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్య దర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, వస్త్ర వ్యాపార సంఘం కోశాధికారి శ్రీగాధ విష్ణు, డైరెక్టర్లు అన్నల్‌దాస్ శ్రీనివాస్, బొద్దు శ్రీధర్, పాలిస్టర్ అసోసియేషన్ కోశాధికారి మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం దీక్షల్లో కూర్చున్నారు. దీక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండల సత్యం తదితరులు ప్రారంభించారు.

చెరువులో పడి బాలుడి మృతి



సాయికృష్ణ(ఫైల్)

తిమ్మాపూర్, జూలై22: మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో ప్రమాదవ శాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళిపాలెం గ్రామానికి చెందిన జువ్వాజి మురళి, పద్మల ఏకైక కుమారుడు జువ్వాజి సాయికృష్ణ(12) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన సాయికృష్ణ మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలోని ముగ్గురు స్నేహితులు కలిసి పాఠశాల వెనకాల గల ఊర చెరువు వద్దకు సైకిల్‌తో ఆడుకుంటూ వెళ్లాడు. చెరువు సమీపంలో సాయికృష్ణ బహిర్భూమికి వెళ్లి చెరువు మెట్ల వద్ద నీటి వద్దకు వెళ్లాడు. ప్రమాదవ శాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. సాయికృష్ణతో వచ్చిన మిత్రులు గమనించి స్థానికంగా పొలంలో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికితో పాటు సాయికృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే చెరువులోకి దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఇద్దరు నేరస్తులపై పీడీయాక్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కోరుట్ల, జూలై 22 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సోమవారం వెల్లడించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని ఝూన్సిరోడ్డుకు చెందిన విత్తనాల నాగరాజు, అర్బన్ కాలనీకి చెందిన గుడ్ల విశాల్‌లపై ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కోరుట్ల పట్టణంతో పాటు కరీం నగర్ ఉమ్మడి జిల్లాలో హత్య కేసులు, సుపారి హత్యలు, బలవంతపు వసూళ్లలో నిందితులుగా ఉన్న నాగరాజు, విశాల్‌లపై పీడీ యాక్ట్‌ను విధించగా వారు ప్రస్తుతం హైదరాబాదులోని చెర్లపల్లి జైలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి వంశీ (27) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశీ ఒక అమ్మాయిని ప్రేమించాడని , ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో తెలుపగా తిరస్కరించినట్లు తెలిపారు. ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని ఆందోళన చెంది ఈ నెల 14న గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడు వంశీ సమాచారం ఇవ్వడంతో పెద్దపల్లి ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లోనూ తనిఖీ ● చెడిపోయిన వస్తువులను పడేసిన అధికారులు

మల్యాల, జూలై 22: మల్యాలలోని బేకరీలు, తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కాలం చెల్లిన వస్తువుల వినియోగం, బూజు వచ్చిన తినుబండారాల అమ్మకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మల్యాలలో గల బేకరీల్లో బూజు వచ్చిన కేకులు, కాలం చెల్లిన బిస్కట్లు, ఆరోగ్యానికి హాని చేసే రంగుల క్రీమ్‌లు లభించడంతో ఆహార తనిఖీ అధికారి ఆర్.అనూష మండిపడ్డారు. చిన్నపిల్లలు తినే ఇలాంటి వాటిని శుచి, శుభ్రతతో కాకుండా అధ్వాన్నంగా బూజు వచ్చిన వాటితో తయారు చేసి అమ్మడం ఏమిటని, ఆహార విక్రయాలకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకోకపోవడంపై నిర్వాహకులను నిలదీశారు. వారం రోజుల్లోగా తీరు మార్చుకోవాలని లేనిచో సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూజు వచ్చిన కేక్‌లు, బిస్కట్ పాకెట్లు, రంగుల పొడిలు ఇతర వస్తువులు పడేశారు. అంతకు ముందు తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో తనిఖీలు చేసి చెడిపోయిన ఉల్లిగడ్డలను వంటలలో వినియోగించడం, ఆదివారం నాటి మటన్ సోమవారం వండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కుళ్లిపోయిన పదార్థాలను పడేసిన అధికారులు

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

గంగాధర, జూలై 22: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్న యాజమానిపై జిల్లా లేబర్ ఆఫీసర్ గుండేటి చక్రధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లేబర్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం గంగాధర మండలంలో ఆపరేషన్ ముస్కాన్10లో భాగంగా తనిఖీలు చేపట్టారు. మధురానగర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన సురేష్ చంద్ర గుజ్జర్ అనే అతను తన పానిపూరీ బండి వద్ద 11 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. బాలుడి వివరాలు సేకరించిన జిల్లా లేబర్ ఆఫీసర్ యాజమాని పనిలో పెట్టుకున్నట్లు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాష్‌పాండ్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా నేడు

కోల్‌సిటీ, జూలై 22: ఎన్‌టీపీసీ రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా యాష్ పాండ్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రభావిత గ్రామాలైన ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపూర్, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ గ్రామస్థులు రిజర్వాయర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాలను కాదని ఆన్‌లైన్ బూడిద టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్టు తెలిరాఆఉ. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



మహిళను సన్మానిస్తున్న ఎస్సై

రామగిరి, జూలై 22: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నీర్ల విజయ అనే గృహిణి తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను అప్పగించి సోమవారం తన నిజాయితీ చాటుకుంది. గ్రామానికి చెందిన చెల్పూరి రాజమౌళికి చెందిన రూ.80వేల విలువ గల సెల్‌ఫోన్ ఫ్యాంట్ జేబులోంచి దారిలో పడిపోయింది. సదరు మహిళ సెల్‌ఫోన్ దొరికిన వివరాలను మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకట రమణరెడ్డికి తెలుపగా పోలీస్‌స్టేషన్ అప్పగించాల్సిందిగా సదరు మహిళకు సూచించారు. అదే గ్రామానికి చెందిన రాజమౌళిదిగా పోలీసులు గుర్తించి అప్పగించారు. సదరు మహిళను ఎస్‌ఐ సందీప్ అభినందించారు.

రైస్ మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు

● ఇతర జిల్లాల సివిల్ సప్లయ్ అధికారులకు బాధ్యతలు



జగిత్యాలలో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు



కల్వశ్రీరాంపూర్‌లోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని సాయిసుధ ఇండస్ట్రీస్, కొత్త శ్రీయాన్ రైస్ మిల్లు, సిరికొండ జీఎస్‌కే ఇండస్ట్రీస్, కొండికర్ల మహాలక్ష్మీ ఇండస్ట్రీస్, పెద్దాపూర్ నిజాం ఆగ్రో ఇండస్ట్రీస్, చెప్యాల్ శ్రీ లక్ష్మీ సరస్వతీ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, గగన్ ట్రేడర్స్ ఇండస్ట్రీస్, నూకపల్లి గునా ఇండస్ట్రీస్, చందోల్ మాధవి ఆగ్రో ఇండస్ట్రీస్, శివ సాయి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీమన్ననారాయణ ఇండస్ట్రీస్, మణికంఠ ఆగ్రోటెక్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ హతీరాం, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, ఈజీఎస్ ఏపీడీ మదన్ మోహన్, తహసీల్దార్లు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● **కాల్వ శ్రీరాంపూర్** : మండలంలోని మంగపేట గ్రామంలోని అన్నదాత ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సోమవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, సేల్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, డీఎం శ్రీకాంత్, డీటీసీఎస్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎఫ్ఐ మల్లికార్జునరావు, ఆర్ఐ రాజేందర్, స్థానిక ఎస్సై ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూలై 22: జిల్లా అటవీశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన పలువురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు స్థానచలనం జరిగింది. కరీంనగర్ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) గంటల శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో తాడ్వాయిలో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌వో షౌకత్‌హుస్సేన్ నియామకమయ్యారు. హుజూరాబాద్ ఎఫ్ఆర్ రాజేశ్వర్‌రావు భూపాలపల్లి జిల్లా కొయ్యూర్ రేంజ్‌కు బదిలీ అయ్యారు. గంగాధర డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కిరణ్మయి కరీంనగర్ స్ట్రైకింగ్‌ఫోర్స్‌కు, సిరిసిల్ల డిప్యూటీ ఎఫ్ఆర్‌వో బాపిరాజుం గంగాధరకు బదిలీ అయ్యారు. చొప్పదండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి వేణుభరణ్ కరీంనగర్‌కు, శంకరపట్నంలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో సరిత కామారెడ్డికి, వేములవాడలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ చొప్పదండికి బదిలీ అయ్యారు. జమ్మికుంటలో పనిచేస్తున్న ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ అనంతరాం గంగాధరకు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సమీనాసర్వీన్ తిమ్మాపూర్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సుజాత కరీంనగర్ డీర్‌పార్క్‌కు బదిలీ అయ్యారు.

ఫేక్ ఐడీతో మహిళలకు చాటింగ్

రుద్రంగి, జూలై 22 ఓ యువకుడి ఫొటోను స్నాప్ చాట్‌లో ప్రొఫైల్‌గా పెట్టి ఫేక్ అకౌంట్‌తో మహిళలకు చాటింగ్ చేసిన సంఘటన రుద్రంగిలో వెలుగుచూసింది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దినేష్ అనే యువకుడి ఫొటోను స్నాప్‌చాట్‌లో ప్రొఫైల్ పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. దీంతో మహిళలకు అసభ్యకరంగా చాటింగ్ చేస్తున్నారని, స్నాప్‌చాట్ ఫేక్ అకౌంట్‌తో చాటింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దినేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్‌ఐ సిరిసిల్ల ఆశోక్ తెలిపారు.

సబ్బితం జలపాతం సందర్శనకు రావద్దు



జలపాతం సందర్శనకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎంపీవో

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టు సింగారం గౌరిగుండాల జలపాతం సందర్శన నిషేధించామని సందర్శకులు ఎవరూ రావద్దని ఎంపీవో సుదర్శన్ సూచించారు. సోమవారం మండలంలోని రంగాపూర్ నుంచి సబ్బితం వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం గౌరిగుండాల జలపాతాన్ని ఎంపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శనకు పలువురు యువకులు రాగా జలపాతానికి వరద ఎక్కువగా వస్తుందని, ఈ సందర్భంగా సందర్శనను నిషేధించినట్లు వారికి తెలిపి వెనక్కి పంపించారు. సందర్శకులు, యువకులు గమనించి సహకరించాలని ఎంపీవో సుదర్శన్ సూచించారు. వారి వెంట ఏపీవో రమేష్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 20,023 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి రాక పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,023 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం సోమవారం 21.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 42.534 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుం చి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 15.108 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

కోటిలింగాల వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

వెల్గటూర్, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. వాగులు, వంకలు పొంగి గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 3389 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలోకి వరద నీరు చేరి నీటి మట్టం పెరుగుతోంది.

గంజాయి విక్రయదారుల అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 22: ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల వద్ద గంజాయి విక్రయిస్తున్న తాళ్లపల్లి గ్రామానికి చెందిన తలపల్లి నాగిరెడ్డి (24), కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గుర్రాల నిఖిల్‌రెడ్డి(19)లు అనే యువకులను అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి తెలిపారు. సిరిసిల్ల సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఆయన అరెస్ట్ వింరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లి గ్రామా నికి చెందిన నాగిరెడ్డి అనే యువకుడు కరీంనగర్‌లోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ గుర్రాల నిఖిల్‌రెడ్డితో పరిచయం ఏర్పడిందన్నారు. ఇద్దరు యువకులు గంజాయి తాగడానికి అలవాటు పడి మరికొందరికి విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారనే సమాచారం మేరకు మార్గమధ్యలో వంతడ్పుల వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా 100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీంతో 100 గ్రాముల గంజాయిని, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే డయల్ 100 లేదా 8712656392కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.



అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల పోలీసులు



పెద్దపల్లి బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

పెద్దపల్లి టౌన్: గంజాయి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సోమవారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేప ట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీంచారు. బస్సులు, ట్రైన్‌లలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేశారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటిని అరికట్టడం, రవాణా, నియంత్రణలో భాగంగా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్, పార్సిల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్సిల్, రవాణా బ్యాగులను, ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు చేపడుతామని తెలిపారు.

కాళేశ్వరం తెలంగాణకు జీవధార

● ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల

కరీంనగర్ టౌన్, జూలై 22: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే చరిత్రహీనులవుతారని ఆయన హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఆయన నివాసగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిండుకుండలా మేడిగడ్డ బ్యారేజీ మారిందన్నారు. కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయిందని, కాళేశ్వరం కొట్టుకు పోయిందంటూ కాంగ్రెస్ పార్టీ, యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేసినా వాళ్ల కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తోందని అన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ ఇన్‌ఫ్లో 8 లక్షల 20వేల క్యూసెక్కులుంటే అవుట్ ఫ్లో 8 లక్షల 20 వేల క్యూసెక్కులని చెప్పారు. 85 గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదులుతున్నారని అన్నారు. ఆరు రోజుల్లో 73 టీఎంసీల నీరు సముద్రం పాలైందని అన్నారు. 7వ బ్లాక్‌లోని 20,21వ పిల్లర్‌లు సురక్షితంగా ఉన్నాయని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూసివేస్తేనే ప్రాజెక్టు గురించి తెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ వింతవాదన చేస్తోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డిలు చెబితే గేట్లు తెరవడం కానీ, మూయడం కానీ జరుగదని,అది నీళ్ల వరద మీద ఆధారపడి ఉంటుందన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

గంగాధర,జూలై 22: గంగాధరలో మోడల్ స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం గంగాధర మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెల్లుతున్న ఆర్టీసీ బస్సు మధురానగర్ చౌరస్తాలో నిలిపి విద్యార్థులను ఎక్కించుకునే తరుణంలో ఆగిపోయింది. డ్రైవర్ బస్సును స్టార్ట్ చేద్దామని అరగంట ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. చేసేది లేక విద్యార్థులు వెనక నుంచి నెట్టినా ఎంతకీ స్టార్ట్ కాలేదు. దీంతో మరో బస్సును రప్పించి విద్యార్థులను పాఠశాలకు చేర్చారు. అరగంట పాటు ఆచంపల్లి, గరకుర్తి, తాడిజెర్రి, రంగరావుపల్లి, కురిక్యాల, మధురానగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలకు వెల్తామా లేదా అని ఆందోళన వ్యక్తం చేశారు.



నిలిచిపోయిన బస్సును నెట్టుతున్న విద్యార్థులు

రూ.7,260 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7260 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 81క్వింటాళ్లు విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7260, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

'మెదడు సంబంధిత వ్యాధులకు అత్యాధునిక చికిత్స'



మాట్లాడుతున్న అపోలో రీచ్ ఆసుపత్రి వైద్యులు

సుభాష్‌నగర్, జూలై 22: మెదడు సంబంధిత వ్యాధులకు అపోలోరీచ్ ఆసుపత్రిలో అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని అపోలో రీచ్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ హరీష్‌కుమార్, న్యూరో రేడియాలజిస్టు ఆక్టర్ సురేష్ గిర్డాని తెలిపారు. సోమవారం వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా నగరంలోని అపోలో రీచ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మెదడులో ఏర్పడిన బ్లడ్ క్లాట్స్‌ను కుట్టు, కోత లేకుండా తొలగించే ప్రక్రియ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మంచి నిద్ర, యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. సమావేశంలో నాగసతీష్ పాల్గొన్నారు.

పోరుబందర్‌ను సందర్శించిన మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూలై 22: గుజరాత్‌రాష్ట్రంలోని పోరుబందర్‌లోని గాంధీజీ జన్మస్థలాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు సోమవారం సందర్శించారు. బోయినపల్లి వినోద్‌కుమార్ తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సతీమణి డాక్టర్ మాధవితో కలిసి గాంధీజి జన్మస్థలంతో పాటు, ద్వారక, సోమనాథ్ ఆలయాలను సందర్శించారు.

ఘనంగా వినోద్‌కుమార్ జన్మదినం

కరీంనగర్‌టౌన్/గణేశ్‌నగర్/భగత్‌నగర్/శంకరపట్నం/మానకొండూర్/ తిమ్మాపూర్/గంగాధర, జూలై 22: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను 33వ డివిజన్‌లోని మేయర్ యాదగిరి సునీల్‌రావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జక్కుల నాగరాజుసాయి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఛైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ నగరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ మండ లాధ్యక్షులు పాల్గొన్నారు.

రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు

సుభాష్‌నగర్, జూలై 22: సీనియర్ గైనకాలజిస్ట్ మరియు ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని గారి ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు ఐయుఐ చికిత్స విధానం గురించి అవగాహన సదస్సు స్థానిక రెనే హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రతిమ వైద్య కళాశాల గైనకాలాజి డిపార్ట్మెంట్ హెచ్‌వోడీ డా.సత్యాప్రభ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సదస్సులో వైద్య విద్యార్థులకు ఐయుఐ చికిత్సా విధానం గురించి డా.బంగారి రజనీ ప్రియదర్శిని వివరించారు. డా.రాజేందర్ మగవారిలో ఇన్ఫర్టిలిటీ చికిత్సా విధానాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ బంగారి స్వామి మాట్లాడుతూ ఇలాంటి విద్యా సదస్సులు నిర్వహించడం అభినంద నీయమన్నారు. ఈ సదస్సులో సీనియర్ స్త్రీల వైద్య నిపుణురాలు డా.ఆది శ్రీదేవి, డా.మౌనిక, ప్రతిమ, చలిమెడ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మెదడు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

సుభాష్‌నగర్, జూలై 22: మెదడు ఆరోగ్యంగా ఉంటేనే శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయని, దానిపై దృష్టి సారించాలని మెడికవర్ ఆసుపత్రి న్యూరో వైద్యులు వెంకటేష్, డాక్టర్ సంజయ్ కమిన్వర్ అన్నారు. ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోహన్ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ క్యాంపు

సుభాష్‌నగర్, జూలై 22: ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్క రించుకొని ఈనెల 24 నుంచి 31 వరకు ఉచిత ఇన్‌ఫెర్టిలిటి క్యాంపును నిర్వహిస్తున్నట్లు రోహన్ ఫెర్టిలిటి క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎనమల్ల శ్రీదేవినరేశ్ తెలిపారు. ఈ క్యాంపులో ఉచిత కన్సల్టేషన్‌తోపాటు అవస రమయ్యే పరీక్షలు, స్కాన్‌పై 30 శాతం డిస్కౌంట్ అందచేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ క్యాంపులో రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులకు ఐయుఐ ప్యాకేజీపై 50శాతం, ఐవీఎఫ్ ప్యాకేజీపై 25శాతం డిస్కౌంట్ ఇస్తామని తెలిపారు.

మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హుజూరాబాద్, జూలై 22: వర్షాల నేపథ్యంలో హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా త్వరితగతిన తగు సహాయ చర్యలు చేపట్టేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారి శుధ్య సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉంటూ ప్రజలకు అత్యవసర సేవ లందించుటకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఉద యం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సిస్టమ్ అసిస్టెంట్ రాంరెడ్డి ఫోన్. 9701567478, సాయంత్రం 6గంటల నుంచి ఉదయం 6గంటల వరకు జూని యర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి ఫోన్ : 8374677885 అందుబాటులో ఉం టారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సమాచారం అందించాలన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ

హుజూరాబాద్, జూలై 22: హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలి కల ఉన్నత పాఠశాలలో సోమవారం సుమారు 80మంది విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుమల, ఉపాధ్యాయులు ఆసియా, రోజారాణి, ఈశ్వర్‌రెడ్డి, అర్చన, మాధవిలత, శ్రీలత, విజయ, ప్రసాద్, సంపత్, కుమార్, సారయ్య, స్వామిరావు, శ్రావణి, శ్రీని వాస్, రాములు, రాణి, శోభరాణి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద చిరు వ్యాపారులను ఆదుకోవాలి

● ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సాయం


అగ్ని ప్రమాద బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూలై 22: హుజూరాబాద్ పట్టణంలోని పాపారావు బొంద వద్ద ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన చిరువ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో అగ్నిప్రమాద బాధితలకు ఒకోక్కరికి రూ. 10చొప్పున 31మందికి రూ. 3.10లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఒక్కో దుకాణం వద్దకు వెళ్లి రూ. 10వేల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ చిరు వ్యాపారులకు జీవనాధారమైన షాపులు దగ్ధమైతే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాటు జిల్లా మంత్రి కనీసం పరామర్శించడం కూడా చేయలేదన్నారు. ఒకోక్క షాపుకు రూ. లక్ష ప్రభుత్వం అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు కేసిరెడ్డి లావణ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

చొప్పదండి,జూలై22: చొప్పదండి లయన్స్ క్లబ్‌కు వ్యక్తిగత విభాగంలో పలు అవార్డులను ప్రకటించారు.క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం,కార్యదర్శి దూస రాము,రాజేశ్ పవార్,మోర భద్రేశం,కొల్లూరి ఆనందం,పెద్ది లక్ష్మీకాంతం,కొల్లూరి జితేందర్ లకు అవార్డులను క్లబ్ గవర్నర్ హన్మాండ్ల రాజిరెడ్డి అందజేశారు.

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'


కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

కరీంనగర్ రూరల్, జూలై22: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర వర్గ సభ్యులు బండి మల్లన్న యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, కాల్వ రామచంద్రం, పెద్ది లక్ష్మణ్, పొలగాని అంజి యాదవ్, పంబాల అనిల్, గాజ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని తహసీల్దార్‌కు సోమవారం బీజేపీ బీసీ మోర్చా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంలోకి రాగానే ఆరు నెలల్లో కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. ప్రభుత్వం వారం రోజుల్లో ఇచ్చిన హామీలను ప్రారంభించకపోతే బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు, నిరసన దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు గంట సంపత్, గంగిశెట్టి ప్రభాకర్, నల్ల సుమన్, బొరగాల సారయ్య మునిగంటి నాగరాజు, పంజాల రేవంత్, ఆవుల సదయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

●**సైదాపూర్:** బీజేపీ ఓబీసీ మోర్చ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండలా ధ్యక్షుడు నెల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు కొలిపాక తిరుపతి, భాషవేన సంపత్ , సుదర్శన్ చారి, కేశవేని కుమార్, నీర్ల సతీష్, సాగర్, కిరణ్, ఐలయ్యఆవుల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో కలపాలి

సుభాష్‌నగర్, జూలై 22: ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగాధర కనకయ్య కోరారు. ఈ మేరకు సోమ వారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మూల జైపాల్, పిట్టల వెంకటేష్, నిమ్మ అంజయ్య, రేండ్ల మల్లిఖార్జున్, పిట్టల రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూలై22: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో సోమవారం వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా ముగిసాయి. నిత్య హోమం, సర్వదైవత్యహోమం అనంతరం వేదపండితులు మహా పూర్ణాహితిని నిర్వహించారు. కళావాహనం తర్వాత నీరాజనం, తీర్థప్రసాద వితరణ జరి గింది. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్ రూరల్, జూలై22: కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్‌లో గ్రామంలో కాకతీయ హైస్కూల్‌కు 1998-99 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటీ బత్తిని కీర్తిలతా గౌడ్ తన పదవ తరగతి మిత్రులతో గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, జూలై 22: ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటి జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ప్రతి రోజు డ్రైనేజీ కాలువలు శుభ్రపరిచాలన్నారు. ప్రతిరోజు సానిటేషన్ నిర్వహించేలా స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

అర్హులంతా రైతు బీమా చేసుకోవాలి

కరీంనగర్ రూరల్: మండలంలోని ప్రతి రైతు పంట బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం అన్నారు. సోమవారం నగరంలోని మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ప్రణయ్, ఎఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయించండి

కరీంనగర్ టౌన్, జూలై 22: నగరంలోని తొమ్మిదో డివిజన్ కోతిరాంపూర్‌లోని అల్కాపురి, పోచమ్మవాడ, వరసిద్ధి వినాయకనగర్, ఎస్ఆర్ నగర్, ఇండియన్ గ్యాస్ గోదాం ప్రాంతాల్లో గత ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా మధ్యలోనే వదిలి వేశారని, వాటిని పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ కోరారు. సోమవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతిని ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

'ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడాలి'


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కరీంనగర్ రూరల్, జూలై 22: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధి లోని ప్రభుత్వ భూములను అధికారులు, రెవెన్యూ సిబ్బంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆస్తులు ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వెంటనే ప్రభుత్వ స్థలాలను కాపాడాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గోష్కిశంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ సోమవారం కలె క్టర్‌కు ఫిర్యాదు చేశారు. బొమ్మకల్ గ్రామంలోని సర్వేనెంబర్ 105లో దాదాపు 4ఎకరాలు, 105బై1లో ఎకరం 2గుంటల భూమిని పహాణిలో చూపించు కుంటూ మోకాపైన చూపించకుండా అలాగే 105బై2 సర్వే నెంబర్ కేటాయిస్తు ఈ భూమిని ఎలా అలాట్మెంట్ చేశారో విచారణ చేప ట్టాలని కోరారు. ప్రభుత్వ స్థలాలను అన క్రాంతం చేస్తున్న ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పై శాఖ పరమైన చర్యలు తీసుకుని వేరే వారికి చేసిన టువంటి భూములను రద్దు చేయాలని కోరారు. సర్వే నెంబర్ 105,0 722బై2, 724 ఈ ప్రభుత్వ సర్వే నెంబర్ల మీద సమాచా హక్కు చట్టం కింద రెవెన్యూ సిబ్బందికి పూర్తి సమాచారం ఇవ్వమని కోరగా కొంత మేరకు సమాచారం ఇచ్చి మిగతాది సిబిసిబిడి వారి వద్ద వుందని నిర్లక్ష్యంగా వ్యవహరిన్నారని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ భూముల వివరాలను ఇప్పించాలని కోరారు.

జాతీయ పతాక ఆమోదిత దినోత్సవం


గార్డియన్ స్కూల్‌లో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 22: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆమోదిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా మల్టీపుల్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి, కోదండరాములు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, నాగసముద్రం వాసరయ్య, పాత శేఖర్, పాత గంగాధర్, జిల్లా అంజయ్య, చెన్నమాదవుని పవనసుతరాజు, కంటె శంకర్, శ్రీపతి వెంకటేశం, బొంగోని దామోదర్, జిల్లా కృష్ణమూర్తి, వడ్లకొండ రాములు, రంగు చెన్నయ్య మేచినేని రామేశ్వర్‌రావు, చిట్టుమల్ల సత్యనారాయణ, శంకరయ్య రాజరెడ్డి, పాత రాహుల్‌నారాయణ, బుర్ర మధుసూదర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**జమ్మికుంట రూరల్:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియన్ స్కూల్‌లో జాతీయ పతాక ఆమోదిత దినోత్సవాన్ని నిర్వ హించారు. నేషనల్ ఫ్లాగ్ డ్రాయింగ్‌లో గెలు పొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రాములు, ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్ పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** మండల లయన్స్‌క్లబ్, లియోక్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆమోద దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామయ్య, క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, లియోక్లబ్ అడ్వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్


క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి


శంకరపట్నంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జూలై22: నిరుపేద కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండ లంలోని ఎల్ఎండి కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ధరఖాస్తుల నమోదులో మానకొండూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. సిఎంఆర్ఎఫ్ కొరకు బాధితులు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో చేసేందుకు క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం 58 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 8 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణా రెడ్డి, తహసిల్దార్ కనకయ్య, నాయకులు గోపు మల్లారెడ్డి, ఎస్ఎల్.గౌడ్, బండారి రమేష్, ఎలుకపల్లి సంపత్,పోలు రాము, రాములు, పోలు రమేష్, సమద్, అశిఖ్ పాషా ఉన్నారు.

● మానకొండూర్ : సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జ రిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం రి లీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

● శంకరపట్నం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం సీఎం ఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం 75వ వన మహో త్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి మొక్క లు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో బషీరుద్దీన్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బసవయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శంకరపట్నం, జూలై 22: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో ప్రజలకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశన మవుతాయని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

జమ్మికుంట, జూలై 22: పిల్లలు డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ వరంగంటి రవి అన్నారు. సోమవారం జమ్మికుంట మున్సి పల్ పరిధిలోని కొత్తపల్లిలో మైనర్ పిల్లల డ్రైవింగ్, సైబర్ నేరాలు, చోరీలు, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై పోలీస్‌లు అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం అన్నారు. పిల్లలు వాహనాల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గంజా యి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరిపిన, ఎవరైన సేవించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరస్థులు, దొంగల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను పరామర్శించిన ప్రణవ్

హుజూరాబాద్, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుజూ రాబాద్ పట్టణంలోని బుడగజంగం కాలనీలో ఇళ్ల చుట్టూ నీళ్ల చేరడంతో సోమ వారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా 300మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్న బాధితులను పరామర్శిం చారు. తమకు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రణవ్ దృష్టికి వారు సమస్యను తీసుకెళ్లారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఈ విషయం గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం చేసేందుకు పాటు పడుతానన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి రోడ్లు, డ్రయినేజీ నిర్మా ణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.


హుజూరాబాద్‌లో బుడగజంగం కాలనీవాసులతో ప్రణవ్

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, జూలై 22: నగరంలోని లో లెవల్ జోన్ పరిధిలోని మార్కెట్ రిజర్వాయర్‌కు సంబంధించిన సిఖ్‌వాడీ, బోయవాడలో పైపులైన్ ఇంటర్ కనెక్షన్ మరమ్మత్తులు చేపడుతున్నందున మంగళ, బుధవారం మంచినీటి సరఫరాకు పలు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ మహేందర్ తెలిపారు. 6, 9, 26, 28, 29, 30, 31, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 52, 53వ డివిజన్ల పరిధిలో మంచినీటి సరఫరాకు రెండు రోజులపాటు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 22: నగరంలో చెట్ల కొమ్మల తొలగిం పులో భాగంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం ప్రాంతంలో విద్యుత్ సర ఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శ్రీవైష్ణవ సంఘ బాధ్యులకు సత్కారం

కరీంనగర్ కల్చరల్, జూలై 22: శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్, మన్నెగూడ, జీఎంఆర్ కన్వెన్షన్‌లో జరిగిన రజతోత్సవాల సందర్భంగా జిల్లా శ్రీవైష్ణవ సంఘం బాధ్యులకు, ఎస్ఎస్‌సి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం జరిగింది. విశిష్ట సేవలకు గాను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్యులు, విద్యార్థుల విభాగంలో పీచర ఆముక్తమాల్యద, డెబ్బట అనిరుధ్‌సాయి, సముద్రాల శ్రేష్ఠలను రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచార్యులు, రాష్ట్ర బాధ్యులు, తదితరుల చేతుల మీదుగా సత్కరించారు.

శ్రీవేంకటేశ్వర కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జూలై 22: స్థానిక కట్టరాంపూర్ మహాలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యా ణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. కార్యక్రమంలో అలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జోగినపల్లి పద్మా అశోక్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

గండ్ర హనుమంతరావు స్మారక సాహితీ పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 22: సమతా సాహితి ఆధ్వర్యంలో సోమవారం భగత్‌నగర్ భగవతి విద్యాసంస్థలో 'షట్చక్రం' విమర్శ గ్రంధ కర్త, తెలంగాణ యూనివర్సిటీ ఆచార్యుడు ఆచార్య లక్ష్మణ చక్రవర్తికి 2023 సంవత్సరానికి సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు పురస్కార ప్రదాతగా ఆయన తండ్రి గండ్ర హనుమంతరావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, భగవతి విద్యాసంస్థల ఛైర్మన్ బి రమణారావు, సాహితీగౌతమి, సమైక్యసాహితి సంస్థల ప్రధాన కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, కెఎస్ అనంతాచార్య పాల్గొన్నారు.

చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22: నగరంలోని రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య చదరంగ పోటీలను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈకార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ పి.ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, జూలై 22: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పురాతన)లో ఆదివారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. తెలంగాణ వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, రిసోర్ట్ ట్రైనర్, బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు పి.జీవన్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ చాంద్, మెంటర్ టీచర్ జేరిపోతుల దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో విద్యార్థులకు వస్తువులు, ఉత్పత్తులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలను పెంచాలి

చొప్పదండి,జూలై22:హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు.సోమవారం ఆయన చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గన్నేరువరం, జులై 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా కంపెనీ వారిచే 'స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

మామిడాలపల్లిలో తెగిన రహదారి

వీణవంక,జూలై22: మండలంలోని మామిడాలపల్లి గ్రామ చివరులో గొల్లపల్లి వద్ద జమ్మికుంట కరీంనగర్ రహదారిపై కల్వర్టు పైనుంచి వరద పారడంతో రోడ్డు పూర్తిగా తెగిపోయింది. కరీంనగర్‌కు రాకపోకలు నిలిచి పోయాయి. పైనుంచి వరద ప్రవాహం పెరగడంతో రోడ్డు ను తాత్కాలికంగా మూసి వేశారు.

దెబ్బతిన్న రోడ్డును పరిశీలించిన ప్రణవ్

వీణవంక,జూలై22:మండలంలోని కనపర్తి గ్రామంలో వరదలతో దెబ్బతిన్న రోడ్డును కాంగ్రెస్ పార్టీ నియోజిక వర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించి తెగిన రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. మండల నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి,చినాల అయిలయ్య, సాహెబ్ హుస్సేన్,పత్తి సమ్మిరెడ్డి ఉన్నారు.

మురికి కాలువలు శుభ్రం చేయాలి

ఇల్లందకుంట, జూలై 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే గ్రామాల్లోని మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట, గడ్డివా నిపల్లె గ్రామాల్లోని పలు వార్డులను సందర్శించారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కృష్ణ, సంధ్య ఉన్నారు.

మానకొండూర్ సీఐగా సదన్‌కుమార్

మానకొండూర్, జూలై 22 : మానకొండూర్ సీఐగా జి. సదన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్క డ పనిచేసిన ఎం. రాజ్‌కుమార్ మల్టీజోన్ ఐజిపి కార్యాల యంకు బదిలీపై వెళ్లారు.

●సంక్షిప్త సమాచారం

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని కందాల నాగరాజుకు సోమవారం ఎల్వోసీని ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు అందజేశారు. నాగరాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2లక్షల చెక్కును ఎమ్మెల్సీ పంపిణీ చేశారు.

ఇల్లందకుంట : ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కరీంనగర్ జిల్లా ఫిషర్మన్ ఛైర్మన్ బండి మల్లేష్ సోమవారం హైద్రాబాద్‌లో మర్యాదపూర్వ కంగా కలిశారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని సాంఘి క సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చిన లచ్చయ్యను టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ సోమవారం కలిశారు.